నమస్తే తెలంగాణ
నల్లగొండ, శుక్రవారం 7 ఫిబ్రవరి 2025
FRIDAY, FEBRUARY 7, 2025

మాజీ ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్, ఆర్ఎస్పీ నివాళి

చిరంజీవి పాడె మోస్తున్న మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్, ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్

కోదాడ రూరల్, ఫిబ్రవరి 6: మండలంలోని గణపవరం గ్రామానికి చెందిన స్వేరోస్ సభ్యుడు బల్గూరి దుర్గయ్య సోదరుడు చిరంజీవి అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్, కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ గురువారం చిరంజీవి భౌతికకాయం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. చిరంజీవి పాడె మోశారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ పొట్ట శ్రీవిజయకిరణ్, నడిగూడెం మాజీ జడ్పీటీసీ బాణాల కవితానాగరాజు, నాయకులు ముడియాల వెంకట్‌రెడ్డి, పోశం పూర్ణయ్య, బొర్ర మధు, పిడమర్తి ప్రసాద్, మామిడి రామారావు, వి.వెంకటేశ్వర్లు, వట్టికూటి శ్రీనివాస్, చెరుకూరి కిరణ్, కాసాని రాంబాబు, వట్టికూటి వెంకటేశ్వర్లు, పొట్ట ప్రసాద్, పోశం ఎర్ర కొండల్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కోటిరెడ్డి నివాళి

సీతారాంరెడ్డి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

నేరేడుచర్ల, ఫిబ్రవరి 6: నేరేడుచర్ల మాజీ సర్పంచ్ కొణతం సీతారాంరెడ్డి అనారోగ్యంతో మృతిచెందగా, గురువారం ఎమ్మెల్సీ కోటిరెడ్డి ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. సీతారాంరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట అడ్వకేట్ కందుకూరి ప్రతాప్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ దొండపాటి అప్పిరెడ్డి, ఇంజమూరి రాములు తదితరులు ఉన్నారు.

ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన కేంద్రం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి

సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

పాలకవీడు, ఫిబ్రవరి 6: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి విమర్శించారు. మండల కేంద్రంలో ఇటీవల మృతిచెందిన సీపీఎం నాయకుడు, మాజీ సర్పంచ్ మీసాల కాశయ్య స్మారకార్థం ఏర్పాటు చేసిన స్థూపాన్ని గురువారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగాన్ని, ఉపాధి హామీ పథకాన్ని నిర్లక్ష్యం చేశారని, ప్రైవేటీకరణకు అధిక ప్రాధాన్యం ఇచ్చారని అన్నారు. మరోవైపు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి ఆదాయం లేదంటున్నారని, హామీలు ఇచ్చేటపుడు ఈ విషయం తెలియదా అని ప్రశ్నించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఈ నెల 10న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద ప్రజా సంఘాలతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా చేపట్టనున్నామని వెల్లడించారు. ఈ సమావేశంలో నాయకులు అనంత ప్రకాశ్, ముషం నరసింహ, మట్టేశ్, ధనమూర్తి పాల్గొన్నారు.

పవర్ ప్లాంట్‌లో చోరీ

నేరేడుచర్ల, ఫిబ్రవరి 6: మండల పరిధి వైకుంఠాపురం గ్రామ సమీపంలోని సాగర్ కాల్వపై నిర్మించిన జల విద్యుత్ కేంద్రంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి రూ.70 వేల విలువైన సామగ్రి ఎత్తుకెళ్లినట్లు జల విద్యుత్ కేంద్రం సూపర్‌వైజర్ గుండ్ల వేణుగోపాలరెడ్డి గురువారం విలేకరులకు తెలిపారు. కళ్లం బ్రదర్ కాటన్ ప్రైవేట్ ఇండస్ట్రీ పవర్ ప్లాంట్ పేరుతో నిర్వహిస్తున్న జల విద్యుత్ కేంద్రంలో కొంతకాలంగా ఉత్పత్తి నిలిచిపోయింది. ఇదే కేంద్రంలో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న వేణుగోపాలరెడ్డి గురువారం పవర్ ప్లాంట్ పరిశీలనకు వెళ్లగా జనరేటర్ గది తాళం తెరిచి ఉండడంతో అనుమానం వచ్చి లోపలికి వెళ్లి చూశారు. 11 కేవీ ఇన్వర్టర్, 150 ఎ.హెచ్, 90 ఎ.హెచ్ బ్యాటరీలతో మొత్తంరూ.70 వేల విలువైన వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించి తక్షణమే జల విద్యుత్ కేంద్రం డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి సమాచారం అందించారు. ఆయన సూచన మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వేణుగోపాల్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ రవీందర్ నాయక్ తెలిపారు.

నల్లబెల్లం, పటిక పట్టివేత

తుంగతుర్తి, ఫిబ్రవరి 6: బొలెరో వాహనంలో నల్లబెల్లం, పటిక తరలిస్తుండగా జిల్లా ఎక్సైజ్‌శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. ఎక్సైజ్ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ రాకేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం తిరుమలగిరి మండలం వెలిశాల ఎక్స్ రోడ్డు వద్ద ఎక్సైజ్ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ సంతోశ్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఓ బొలెరో వాహనాన్ని తనిఖీ చేయగా 1,200 కిలోల నల్ల బెల్లం, 350 కిలోల పటిక పట్టుబడింది. నల్ల బెల్లం, పటిక తరలిస్తున్న కర్నాలకుంట తండాకు చెందిన నవనాత్ సాహు, గుగులోతు యాకన్నను అదుపులోకి తీసుకున్నామని, నవీన్ అనే మరోవ్యక్తి పరారయ్యాడని సీఐ తెలిపారు. బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు వెల్లడించారు. తనిఖీలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ గోపాల్, హెడ్ కానిస్టేబుళ్లు అప్సర్, అయూబ్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

సిమెంట్ లారీ బోల్తా

రోడ్డుపై నిలిచిపోయిన వాహనాలు

కోదాడ రూరల్, ఫిబ్రవరి 6: మండల పరిధి నల్లబండగూడెం శివారులోని 65వ నంబర్ జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం సిమెంట్ లారీ బోల్తాపడింది. చిల్లకల్లు సమీపంలోని సిమెంట్ పరిశ్రమ నుంచి సిమెంట్ లోడుతో హైదరాబాద్‌కు వెళ్తున్న వాహనం పాలేరు వాగుపై కొత్త బ్రిడ్జి వద్దకు రాగానే అదుపుతప్పి రోడ్డుకు అడ్డంగా బోల్తాపడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు తీవ్రగాయాలవడంతో ఆసుపత్రికి తరలించారు.. కాగా, లారీ రోడ్డుపై అడ్డంగా పడడంతో సుమారు రెండు గంటల పాటు ట్రాఫిక్ స్తంభించింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

CHANGE OF NAME
I, **BASANI ESWARYA YUGENDRA KUMAR** S/o. **BASANI SAILU ESWARYA** MOTHER NAME : BASANI ESWARYA VENKATAMMA, DOB : IS 18/03/1982 (OLD NAME, FATHER NAME, MOTHER NAME & DATE OF BIRTH) R/O. H.NO.6-3-579, GANDHINAGAR, NEAR YADAVA SANGAM, NALGONDA TOWN & DISTRICT, TELANGANA STATE, I HAVE CHANGE MY NAME AND FATHER NAME AND MOTHER NAME AND DATE OF BIRTH AS **BASANI YUGENDHAR KUMAR S/O. BASANI ESWARAIAH, MOTHER NAME : BASANI VENKATAMMA,** DATE OF BIRTH : 18/03/1984 (NEWNAME AND FATHER, MOTHER NAME & DATE OF BIRTH).

CHANGE OF NAME
★I, V.SREENIVASULU, H.No. 4-80, Appajipeta (V), Appajipet Post, Nalgonda District, Telangana-508 001. Changed My Name from V.SREENIVASULU to VALLAKIRTHY SRINIVASULU, S/o. Vallakirthy Vishnumurthy.
NT-329087

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం

నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, (గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.

నల్లగొండ : 9182777626	నల్లగొండ : 9182777635	దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059	సూర్యాపేట : 9182777630	భువనగిరి : 9182777638
మిర్యాలగూడ : 9182777059	కోదాడ : 9182777630	చౌటుప్పల్ : 9182777638

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

- రాష్ట్ర వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

పొలాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు

పెన్‌పహాడ్, ఫిబ్రవరి 6: నకిలీ విత్తనాలు అమ్మితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అన్నారు. మండలంలోని పొట్లపాడ్ గ్రామానికి చెందిన రైతు బొల్లాక సాదయ్య, న్యూ బంజారాహిల్స్ తండాకు చెందిన రైతులు భూక్య అంజి, గజ్జి వెంకన్న సుమారు 40 ఎకరాల్లో కావేరి చింట్లు, మహేంద్ర చింట్లు వరి విత్తనాలు తీసుకొచ్చి సాగు చేపట్టారు. 30 రోజులకే వరిలో తల్లి, పిల్ల కంకులు రావడంతో పంట దిగుబడిపై ప్రభావం చూపి నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళనకు గురయ్యారు. పొలాలు కౌలుకు తీసుకొని వేల రూపాయల పెట్టుబడులు పెట్టి సాగు చేస్తుంటే 30 రోజులకే కంకులు కనిపించడంతో మోసపోయామని గుర్తించిన రైతులు విత్తన డీలర్లతో పాటు వ్యవసాయాధికారులను సంప్రదించినా న్యాయం జరగకపోవడంతో వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డికి ఫిర్యాదు చేశారు. దీంతో గురువారం ఆయన పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు ఆయన ఎదుట తమ గోడును వెల్లబోసుకున్నారు. అధిక దిగుబడి పేరుతో గడ్డిపల్లి గ్రామంలోని వెంకటసాయి సీడ్స్ కంపెనీ తమకు నకిలీ వరి విత్తనాలను అంటగట్టిందని తెలిపారు. అనంతరం కోదండరెడ్డి మాట్లాడుతూ..నకిలీ విత్తనాలు అమ్మిన కంపెనీలపై చర్యలు తీసుకుంటామని, అన్ని విధాలా అధ్యయనం చేసిన తర్వాత ప్రభుత్వానికి నివేదిక ఇచ్చి రైతులకు న్యాయం చేస్తామని తెలిపారు. కమిషన్ సభ్యులు రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, చెవిటి వెంకన్నయాదవ్, మరికంటి భవానిరెడ్డి, భూమి సునీల్, జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్‌రెడ్డి, తాసీల్దార్ లాలునాయక్, ఏఓ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

- తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెలగద్దర్

సదస్సులో మాట్లాడుతున్న వెన్నెలగద్దర్

సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 6: గంజాయి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాలకు విద్యార్థులు, యువత దూరంగా ఉండాలని తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెలగద్దర్ పిలుపునిచ్చారు. డ్రగ్స్, గంజాయికి వ్యతిరేకంగా తెలంగాణ విద్యార్థి, యువజన సమితి సంస్థలు సంయుక్తంగా స్థానిక పబ్లిక్ క్లబ్ ఆడిటోరియంలో గురువారం నిర్వహించిన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. నేటి సమాజానికి మాదక ద్రవ్యాలు పెను సవాల్‌గా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయి, డ్రగ్స్‌పై తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించి రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు, యువతను చైతన్యపరుస్తున్నట్లు తెలిపారు. సదస్సులో తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మార్జున్, యువజన సమితి రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ సలీమ్‌పాషా, జిల్లా అధ్యక్షుడు భిక్షంనాయక్, విద్యార్థి జన సమితి జిల్లా అధ్యక్షుడు బొమ్మగాని వినయ్, టీజేఎస్ అధ్యక్షుడు గట్ల రమాశంకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిరణ్, తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు బండ నాగరాజు, రైతు జన సమితి జిల్లా అధ్యక్షుడు కొల్లు కృష్ణారెడ్డి, మాసంపల్లి అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెరువు నీటి తోడకాన్ని నిలిపివేయాలని ఆందోళన

చెరువు వద్ద ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు

చివ్వెంల, ఫిబ్రవరి 6: మోటార్ల ద్వారా చెరువు నీటి తోడకాన్ని నిలిపివేయాలని గుంజలూరు గ్రామానికి చెందిన పలువురు రైతులు గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గుంజలూరు శివారులోని పెద్ద చెరువు, దొడ్డుకుంట చెరువుల్లో కొందరు రైతులు అక్రమంగా మోటార్లు వేసి తమ పొలాలకు నీటిని మలుపుతున్నారని, దీంతో చెరువు కింద ఉన్న ఆయకట్టు రైతులందరి పొలాలు ఎండిపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే చెరువుల్లో నీళ్లు అడుగంటే స్థితిలో ఉన్నాయని, ఈ చెరువుల కింద గ్రామానికి తాగునీటిని సరఫరా చేసే రెండు బోర్లు ఉన్నాయని తెలిపారు. ఎండాకాలంలో గ్రామస్తులతో పాటు పశువులకు సైతం నీళ్లు దొరికే పరిస్థితి ఉండదన్నారు. వెంటనే అధికారులు సందర్శించి మోటార్లు తొలగించాలని కోరారు. ఆందోళనలో రైతులు పెద్ది రాజశేఖర్, ఏక్కటి వెంకట్‌రెడ్డి, కొనకంచి శ్రీనివాస్, బొల్లికొండ కనకయ్య, మెలుగూరి వెంకన్న, గోపి, నాగయ్య, వీరబాబు, సైదులు, గోపీనాథ్ పాల్గొన్నారు.

పెద్దగట్టు జాతరలో దుకాణాల ఏర్పాటుకు 9న స్థలాల కేటాయింపు

చివ్వెంల, ఫిబ్రవరి 6: పెద్దగట్టు జాతరలో దుకాణాల ఏర్పాటుకు ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు స్థలాలు కేటాయించనున్నట్లు వేలం పాట హక్కుదారులు మామిడి కిరణ్, పాల్వాయి లక్ష్మణ్ తెలిపారు. గురువారం ఆలయ ప్రాంగణంలో వారు విలేకరులతో మాట్లాడారు. గతంలో రసీదులు పొంది దుకాణాలు నిర్వహించిన వారు ఆలయ ప్రాంగణంలో సంప్రదించాలని సూచించారు. నిర్ణయించిన తేదీ అనంతరం వస్తే స్థలం ఇవ్వబడదని తెలిపారు. నిర్ణీత సమయానికి వచ్చి రసీదులు పొంది నిర్వాహకులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రాము, ప్రభాకర్, వినయ్ వర్మ పాల్గొన్నారు.

'విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి'

మఠంపల్లి, ఫిబ్రవరి 6: మండల పరిధిలోని కేజీబీవీ, టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్, పెదవీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మానవ వికాస వేదిక రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మారెడ్డి భాస్కర్ ఆధ్వర్యంలో గురువారం సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ.. సైన్స్ వారోత్సవాల్లో భాగంగా పాఠశాలల్లో సైన్స్ దినోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించాలి : ఎంఈఓ

గరిడేపల్లి, ఫిబ్రవరి 6: విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని మండల విద్యాధికారి పానుగోతు చత్రునాయక్ ఉపాధ్యాయులకు సూచించారు. జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పలు ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాటాడుతూ.. విద్యార్థులకు వ్యక్తిగత శుభ్రత, పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలని సూచించారు. సీహెచ్ ఓటీ నరసింహ, పీహెచ్ఎన్ ఎం.శారద, ఎంపీ రమణ, సీఆర్పీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజల పక్షాన సీపీఐ పోరాటం'

గరిడేపల్లి, ఫిబ్రవరి 6: నిరంతరం ప్రజల పక్షాన పోరాడే సీపీఐ అభ్యర్థులను రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించాలని ఆ పార్టీ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు కోరారు. గురువారం మండల కేంద్రం గరిడేపల్లిలో నిర్వహించిన సీపీఐ మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే సీపీఐ తరపున బరిలో నిలిచే వారిని గెలిపించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కారానికి ఎనలేని పోరాటాలు చేస్తున్నామన్నారు. సీపీఐ జిల్లా సమితి సభ్యుడు త్రిపురం సుధాకర్‌రెడ్డి, మండల కార్యవర్గ సభ్యులు ఎడ్ల అంజిరెడ్డి, కడియాల అప్పయ్య, కుందూరు వెంకటరెడ్డి, పంగ సైదులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

గరిడేపల్లి: స్వపరిపాలన దినోత్సవంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఆత్మకూర్.ఎస్ ప్రాథమిక పాఠశాలలో..

గరిడేపల్లి, ఫిబ్రవరి 6: మండల కేంద్రంలోని హైస్కూల్‌లో గురువారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, అధికారులు, ప్రజాప్రతినిధుల వేషధారణలో విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి, ప్రధానోపాధ్యాయులు పి.చత్రునాయక్, రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్.ఎస్: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు ఉర్మిళ, ఉపాధ్యాయులు పి.వనజ, రజని, జి.రమేశ్, ఎస్.చౌదరిరెడ్డి, జి.సురేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

'కులగణన నివేదిక తప్పుల తడక'

మేళ్లచెర్వు, ఫిబ్రవరి 6: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన బీసీ కులగణన నివేదిక తప్పుల తడకగా ఉందని మాజీ ఎంపీటీసీ, బీఆర్ఎస్ నాయకుడు జనిగ సైదులు విమర్శించారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సర్వే సమయంలో కొందరు తమ వివరాలను వెల్లడించలేదని, అన్ని కుటుంబాలను, మైనర్లను పరిగణనలోకి తీసుకోకుండా కులగణన చేయడం ఏంటని ప్రశ్నించారు. జనాభా మొత్తాన్ని సర్వే చేయకుండా అంతా పకడ్బందీగా నిర్వహించామని చెప్పుకోవడం సరికాదన్నారు.

నేడు పశువైద్య శిబిరం

మేళ్లచెర్వు, ఫిబ్రవరి 6: స్థానిక మైహోం సిమెంట్ ఇండస్ట్రీస్, పశుసంవర్ధకశాఖ సంయుక్త ఆధ్వర్యంలో మండల పరిధిలోని వెంకట్రాంపురం గ్రామంలో శుక్రవారం ఉచిత మెగా పశువైద్య శిబిరం నిర్వహించనున్నట్లు పరిశ్రమ ప్రతినిధులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

మునగాల, ఫిబ్రవరి 6: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు ప్రవేశాల కోసం ఈ నెల 28వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ బూర సైదయ్య గౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో 100 సీట్లు, 7 నుంచి 10వ తరగతి వరకు ఖాళీ అయిన సీట్లను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 13న స్థానిక ఆదర్శ పాఠశాలలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

ప్రెస్‌క్లబ్ ఉపాధ్యక్షుడి ఎన్నిక

గరిడేపల్లి, ఫిబ్రవరి 6: గరిడేపల్లి ప్రెస్‌క్లబ్ ఉపాధ్యక్షుడిగా గుడుగుంట్ల భిక్షంను ఎన్నుకున్నారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో అధ్యక్షుడు కడారు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి సంద్ర శివ అధ్యక్షతన ఉపాధ్యక్షుడిగా భిక్షం, కోశాధికారిగా గణపురం విజయ్, సహాయ కార్యదర్శిగా కుర్ర గోపిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన

నడిగూడెం, ఫిబ్రవరి 6: ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయాన్ని చేపట్టాలని సిరి ఫౌండేషన్ చైర్మన్ మొలుగూరి గోపి కోరారు. గురువారం మండలంలోని వేణుగోపాలపురం, సిరిపురం, వల్లాపురం గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రతి రైతు ఒక మడి లేదా అరెకరంలో ఎలాంటి రసాయన ఎరువులు వాడకుండా సహజ పద్ధతులను పాటించి సాగు చేపట్టాలని కోరారు. మనతో పాటు భవిష్యత్ తరాలు కూడా ఆరోగ్యంగా ఉండాలంటే ప్రకృతి వ్యవసాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

చిలుకూరు, ఫిబ్రవరి 6: మండలంలోని రామాపురం హైస్కూల్ పదో తరగతి విద్యార్థులకు కేవీఆర్ ఫౌండేషన్ చైర్మన్ కేతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి సహకారంతో గురువారం స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శివకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలి'

సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 6: సూర్యాపేటకు చెందిన దళిత యువకుడు వడ్లకొండ కృష్ణ అలియాస్ మాల బంటిని హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించేందుకు ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట గోపి అన్నారు. ఈ మేరకు గురువారం సూర్యాపేటలో బంటి కుటుంబాన్ని పరామర్శించేందుకు వచ్చిన రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తలమల్ల హసేన్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు మర్రి నాగేశ్వర్‌రావు, మాల మహానాడు నాయకులు వీర్లాల వేణు, కట్టా సైదులు, దేవరకొండ యాదగిరి, ఆనందరావు పాల్గొన్నారు.

బంటి కుటుంబానికి రక్షణ కల్పించాలి

- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య

బంటి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న రాష్ట్ర ఎస్సీ , ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

సూర్యాపేట, ఫిబ్రవరి 6 : ఇటీవల హత్యకు గురైన వడ్లకొండ కృష్ణ (మాల బంటి) కుటుంబానికి రక్షణ కల్పించి, నిందితులను కఠినంగా శిక్షించాలని ఎస్సీ, ఎస్టీ రాష్ట్ర కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశించారు. గురువారం ఎస్సీ, ఎస్టీ కమిటీ సభ్యులతో కలిసి మాల బంటి భార్య భార్గవి, తండ్రి భిక్షం, సోదరి శ్వేత, బావ నరేశ్‌ను ఆయన పరామర్శించి మాట్లాడారు. అనంతరం కలెక్టరేట్‌లో కేసు పురోగతిపై అధికారులతో చర్చించారు. కేసు వెనక్కి తీసుకుంటే రూ.2 కోట్లు ఇస్తామని, లేకపోతే చంపేస్తామని బెదిరిస్తున్నారని బాధితులు చైర్మన్ వెంకటయ్యకు ఫిర్యాదు చేయగా.. బెదిరింపులకు పాల్పడుతున్న వారిని వెంటనే అరెస్టు చేయాలని పోలీసులను ఆదేశించారు. కేసు పురోగతిని అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు, డీఎస్పీ రవి ఆయనకు వివరించారు. హత్యలో పాల్గొన్న ఆరుగురిని అరెస్టు చేశామని, మిగతా వారిని కూడా అరెస్ట్ చేస్తామని చెప్పారు. బాధిత కుటుంబానికి రూ.4 లక్షల నష్టపరిహారం చెల్లించామని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. అనంతరం కమిషన్ చైర్మన్ వెంకటయ్య మాట్లాడుతూ బంటి కుటుంబాన్ని పూర్తిస్థాయిలో ఆదుకోవాలని అధికారులకు సూచించారు. చట్ట ప్రకారం నిత్యావసర సరుకులు, తక్షణ సాయం అందించాలన్నారు. పింఛన్, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, ఐదెకరాల భూమి, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కలెక్టర్‌కు సూచించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లా డీవీఎంసీ సమావేశం, ప్రతి నెలాఖరున పౌర హక్కుల దినోత్సవం జరుపాలన్నారు. కమిషన్ సభ్యులు శంకర్, రాంబాబు, ఆర్డీఓ వేణుమాధవ్, ఎస్సీ సంక్షేమ జిల్లా అధికారి లత పాల్గొన్నారు.

'అరుణోదయ' రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక

సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 6: అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఈ నెల 5న సూర్యాపేటలో జరిగిన విలీన సభలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా పరకాల నాగన్న, అధ్యక్షుడిగా పి.వేణు, ఉపాధ్యక్షులుగా రాయికృష్ణ, ఉదయగిరి, ఇట్టబోయిన రవి, మల్లయ్య, బతుకుల రాజన్న, బొగ్గరపు వెంకయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎస్.దాసు, సహాయ కార్యదర్శులుగా ఎడంపాక శ్రీశైలం, చిరంజీవి, కాంచనపల్లి సైదులు, అబ్దుల్, స్వప్న, జక్కంపూడి కొండలరావు, కోశాధికారిగా కుమారస్వామితో పాటు ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

వరిలో తల్లికర్ర ఈనితే రెండోసారి యూరియా వేయాలి : డీఏఓ

సమావేశంలో మాట్లాడుతున్న డీఏఓ శ్రవణ్‌కుమార్

నల్లగొండ, ఫిబ్రవరి 6: యాసంగిలో నవంబర్-15 నుంచి డిసెంబర్-20 వరకు మాత్రమే నార్లు పోసుకోవాలని.. అంతకు ముందుగా పోస్తే చలి కారణంగా తల్లి వేరు ఎదుగదని, తర్వాత పోస్తే తల్లి వేరు త్వరగా ఈనుతుందని జిల్లా వ్యవసాయ అధికారి పాల్వాయి శ్రవణ్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులకు పలు సూచనలు చేశారు. 40 నుంచి 45 రోజుల నారు పోసినప్పటికీ అదే సమస్య వచ్చే అవకాశం ఉందన్నారు. రైతులు చివరగా దమ్ము చేసినప్పుడు డీఏపీ వేసిన తర్వాత యూరియా వేయకపోవటం వల్ల, పొలంలో అధిక భాస్వరం నిల్వలు ఉన్నా, చలి, చౌడు, నీటి ఎద్దడి, పోషకాల లోపం, యాజమాన్యలోపం వల్ల కూడా తల్లి కర్ర ముందుగా ఈనుతుందని తెలిపారు. ఈ సమస్య నుంచి బయట పడేందుకు 20-25 రోజుల నారు మాత్రమే నాటుకోవాలన్నారు. ఒకవేళ తల్లి కర్ర ఈనటం గమనిస్తే రెండో దఫా యూరియా వేయాలని, ఒక వేళ వేయకుంటే మూడో దఫా వేసేటప్పుడు రెండో దఫాకూడా కలిపి వేయాలని సూచించారు. జింక్ లోపం ఉంటే లీటర్ నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపి పది రోజుల్లో రెండు సార్లు పిచికారీ చేయాలన్నారు. సమావేశంలో శాస్త్రవేత్తలు సీహెచ్ రాజు, వీ శ్రీధర్, రాములమ్మ, ఏఓలు శ్రీనివాస్, కీర్తి పాల్గొన్నారు.

'మహాధర్నాను విజయవంతం చేయాలి'

పెన్‌పహాడ్, ఫిబ్రవరి 6: కేంద్ర బడ్జెట్‌కు నిరసనగా ఈ నెల 10న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద చేపట్టే మహాధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు ఆ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం మండలంలోని సత్య ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల కార్యదర్శి గుంజా వెంకటేశ్వర్లు, నాయకులు ఐతబోయిన సత్యం, దనియాకుల శ్రీకాంత్ వర్మ, వీరబోయిన రవి, రణపంగ కృష్ణ, మడ్డి అంజిబాబు, నెమ్మాది అడివయ్య, ఇరుగు రమేశ్, ధనియాకుల శ్రీను పాల్గొన్నారు.

వేపలసింగారంలో క్షయ నిర్ధారణ శిబిరం

మాట్లాడుతున్న వైద్యాధికారి వేణుగోపాల్ నాయక్

హుజూర్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 6: మండలంలోని వేపలసింగారం గ్రామంలో లింగగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం క్షయ వ్యాధి నిర్ధారణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి వేణుగోపాల్ నాయక్ మాట్లాడుతూ.. ఇప్పటివరకు 7 ఆరోగ్య ఉపకేంద్రాల పరిధిలో 346 మందికి కల్లె పరీక్షలు నిర్వహించడంతో పాటు 70 మందికి సైట్ టీబీ టెస్టు, 107 మందికి ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. క్షయ వ్యాధి నిర్ధారణ అయితే ప్రభుత్వం ఉచితంగా మందులను అందించడంతో పాటు రూ.800 విలువైన పౌష్టికాహార కిట్ ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ పద్మ, హెల్త్ అసిస్టెంట్ ఇందిరాల రామకృష్ణ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పద్మ, పీహెచ్ఎన్ నూర్జహాన్, సూపర్‌వైజర్ పద్మ, ఎల్‌టీ రమేశ్ పాల్గొన్నారు.

అజొల్లా సాగుకు రైతులు ముందుకు రావాలి : ఎంపీడీఓ

గుంజలూరులో అజొల్లా సాగును పరిశీలిస్తున్న ఎంపీడీఓ సంతోశ్‌కుమార్

చివ్వెంల, ఫిబ్రవరి 6: అజొల్లా సాగుకు రైతులు ముందుకు రావాలని ఎంపీడీఓ సంతోశ్‌కుమార్ అన్నారు. మండలంలోని గుంజలూరు గ్రామంలో పెదపోలు జయమ్మ అనే మహిళా రైతు తన ఇంటి ఆవరణలో ఉపాధి హామీ పథకంలో భాగంగా తొట్లు నిర్మించి సాగు చేసిన అజొల్లాను ఎంపీడీఓ గురువారం పరిశీలించి మాట్లాడారు. అజొల్లా పశువులకు దాణాగా, వరి పొలాల్లో కలుపు పుట్టకుండా సహాయపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ దయాకర్, ఏపీఓ నాగయ్య, టీఏ విజయ్, పంచాయతీ కార్యదర్శి శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు స్థల పరిశీలన

పాలెఅన్నారంలో స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

చిలుకూరు, ఫిబ్రవరి 6: మండలంలోని పాలెఅన్నారం గ్రామ పరిధిలో సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు రెవెన్యూ, డీఆర్‌డీఏ అధికారులు గురువారం స్థల పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సోలార్ ప్లాంట్‌కు 4 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లుగా తెలిపారు. తాసీల్దార్ ధృవకుమార్, ఏపీడీ సురేశ్, ఏపీఎం నర్సయ్య, ఆర్ఐ సీతయ్య, సీపీ స్వరూప పాల్గొన్నారు.

'మతోన్మాదాన్ని ఎదుర్కొనేందుకు యువత సిద్ధం కావాలి'

ఆత్మకూర్.ఎస్, ఫిబ్రవరి 6: మతోన్మాదాన్ని ఎదుర్కొనేందుకు యువత సిద్ధం కావాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సానబోయిన ఉపేందర్ పిలుపునిచ్చారు. ఏపూరు గ్రామంలో బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన డీవైఎఫ్ఐ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ యువతను, ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ మతాన్ని పెంచి పోషిస్తున్నదని విమర్శించారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించకుండా కాలయాపన చేస్తున్నదన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, నిరుద్యోగ భృతి చెల్లించాలని, జాబ్ క్యాలెండర్ ప్రకారం ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. మహాసభలో జుజ్జురి సతీశ్, షేక్ అఖిల్ పాషా, అవిరె సాయికుమార్, నవిల లింగయ్య, అవిరె అప్పయ్య, నూకల గిరిప్రసాద్‌రెడ్డి, ఎరుకల నాగరాజు, సాయి, లింగయ్య, రవి, మహేశ్, భిక్షం పాల్గొన్నారు.